నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, శుక్రవారం 5 జనవరి 2024 | KAMAREDDY

ఏపీ సీఎంకు వేముల స్వాగతం

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను పరామర్శించేందుకు గురువారం బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న ఏపీ సీఎం జగన్‌కు బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం జగన్‌తో కలిసి కేసీఆర్ ఇంటికి వెళ్లారు.
– వేల్పూర్, జనవరి 4

దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి: నిజామాబాద్ కలెక్టర్

అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ స్పోర్ట్స్/జక్రాన్‌పల్లి, జనవరి 4: ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజలు అందిస్తున్న దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. జక్రాన్‌పల్లి మండలంలోని అర్గుల్ పంచాయతీలో ప్రజాపాలన కార్యక్రమాన్ని కలెక్టర్ గురువారం పరిశీలించారు. నిర్దేశిత గడువులోగా దరఖాస్తు వివరాల నమోదు పూర్తయ్యేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి, నోడల్ అధికారి తిరుమల ప్రసాద్, మండల ప్రత్యేకాధికారి ఉన్నారు.

విద్య, వైద్య రంగాల బలోపేతానికి కృషి

- రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- జక్రాన్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనం ప్రారంభం

పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

జక్రాన్‌పల్లి, జనవరి 4 : సమాజంలో విద్య, వైద్యం ఎంతో కీలమైనవని, ఈ రెండు రంగాలను పటిష్టపర్చాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నదని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సమాజానికి ఎంతో కొంత తోడ్పాటును అందించాలనే తపన ప్రతిఒక్కరిలో ఉండాలని, ఆ దిశగా ముందుకు సాగినప్పుడే అన్ని విధాలుగా అభివృద్ధి చెందిన సమాజం ఆవిష్కృతమవుతుందన్నారు. జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో మన ఊరు – మన బడి కార్యక్రమం కింద రూ.62.77 లక్షల ప్రభుత్వ నిధులతో పాటు దాతలు పెద్ద ఎత్తున సమకూర్చిన విరాళాలతో నిర్మించిన ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన భవన సముదాయాన్ని మంత్రి గురువారం ప్రారంభించారు. ముందుగా సరస్వతీ మాత విగ్రహానికి పూజలు చేశారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పాఠశాల నిర్మాణానికి సింహాభాగం విరాళాలను అందించి తన దాతృత్వాన్ని చాటుకున్న పైపుల రాజిరెడ్డి ఆయన కుటుంబ సభ్యులతో పాటు ఇతర దాతలను సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దాతృత్వం అంటే ఎలా ఉండాలనడానికి పైపుల రాజారెడ్డి ప్రత్యక్ష నిదర్శనమన్నారు. సామాన్య ప్రజలకు ఉపయుక్తంగా నిలుస్తున్న ఆరోగ్యశ్రీ సేవలను మరింత బలోపేతం చేస్తామని మంత్రి వెల్లడించారు. ప్రజాప్రతినిధులందరూ ప్రభుత్వ బడులపై తప్పనిసరిగా ఆలోచన చేస్తూ వాటి అభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం అంకిత భావంతో కృషి చేయాలన్నారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మాట్లాడుతూ విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు దాత రాజిరెడ్డి పెద్ద ఎత్తున తోడ్పాటునందించడం అభినందనీయమన్నారు. అంతకుముందు జక్రాన్‌పల్లి శివారులోని దేవుని తండాలోని శ్రీలక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానంలో మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి, ఆర్డీవోలు పాల్గొన్నారు.

ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలి

రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి మండలంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ప్రభుత్వ పాఠశాలను నిర్మించాలనే సంకల్పంతో ముందుకెళ్తున్నామన్నారు. కాగా డిచ్‌పల్లిలో మాతా, శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రాన్ని ఇందల్వాయిలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరగా మంత్రి దామోదర రాజనర్సింహ సానుకూలంగా స్పందించారు.

ప్రజాపాలన నిరంతర ప్రక్రియ

ఇంటర్వ్యూ

- రేపటితో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ ముగింపు
- నేటినుంచి డాటా ఎంట్రీ
- గడువు తర్వాత కూడా అప్లికేషన్లు స్వీకరిస్తాం
- ఎక్కడా కొరత లేకుండా అందుబాటులో ఫారాలు
- జిరాక్స్ ప్రతులు ఇచ్చినా స్వీకరించి రశీదు ఇస్తున్నాం
- 'నమస్తే తెలంగాణ'తో కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

ప్రజాపాలన కార్యక్రమంలో అభయహస్తం ఆరు గ్యారెంటీ పథకాలకు సంబంధించిన ప్రతి దరఖాస్తును నేటి నుంచి డాటా ఎంట్రీ చేయబోతున్నట్లుగా కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రజాపాలన కార్యక్రమానికి ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వస్తున్నదన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో కౌంటర్ల వద్దకు వచ్చి ఆయా పథకాలకు దరఖాస్తు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ సిబ్బందికి ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు చేయడం ద్వారా మొదట్లో ఎదురైన ఇక్కట్లు ప్రస్తుతం వెలుగు చూడడం లేదని చెప్పారు. కామారెడ్డి జిల్లాలో 2.5లక్షల కుటుంబాలుంటే అంతకన్నా ఎక్కువ దరఖాస్తులను ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు వివరించారు. ప్రజాపాలన దరఖాస్తుల ప్రక్రియ ముగింపునకు చేరుతుండడంతో ఈ ప్రక్రియ జరుగుతున్న తీరుపై కలెక్టర్ జితేశ్ వీ పాటిల్‌ను 'నమస్తే తెలంగాణ' పలుకరించింది. మరిన్ని వివరాలు ఆయన మాటల్లోనే..

–నిజామాబాద్, జనవరి 4
(నమస్తే తెలంగాణ ప్రతినిధి)



గడువు తర్వాత మండల కేంద్రాల్లో..

ప్రజాపాలన అభయహస్తం పథకాలకు దరఖాస్తుల స్వీకరణ రేపటితో(జనవరి 6) ముగుస్తుంది. ఎవరైనా దరఖాస్తు చేయని నేపథ్యంలో వారంతా స్థానికంగా మండల కేంద్రాల్లోని ఎంపీడీవో, తహసీల్ కార్యాలయాల్లోనూ ఫారాలను అందివ్వొచ్చు. ప్రభుత్వం సైతం ప్రతి నాలుగు నెలలకు ఒకసారి ఈ ప్రక్రియను చేపడుతున్నట్లుగా ప్రకటన చేసిన నేపథ్యంలో ప్రజలెవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఒక్కో కుటుంబానికి ఒక్కో దరఖాస్తును అందిస్తున్నాం. పైగా కుటుంబంలో ఒకటికిపైగా దరఖాస్తులు నింపాల్సిన అవసరం లేదని ప్రజలకు వివరిస్తున్నాం. మండలాల్లో తహసీల్దార్, ఎంపీడీవోలను టీమ్ లీడర్లుగా నియమించాం. వారి పరిధిలోని కౌంటర్లలో దరఖాస్తుల ప్రక్రియను పర్యవేక్షిస్తారు. ప్రజలకు ఏమైనా అనుమానాలు ఉంటే టీమ్‌లీడర్లను సంప్రదించాలి.

ఫారాలు ఉచితమే..

పథకాల దరఖాస్తుకు గడువు సమీపించడంతో చివరి రోజు ప్రజలు ఎక్కువగా వచ్చే వీలుంటుంది. మరింత జాగ్రత్తలు తీసుకుంటూ ఈ ప్రక్రియను విజయవంతంగా ముగిసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఫారాలను ఉచితంగానే అందిస్తున్నాం. ఎవ్వరికీ నయా పైసా ఇవ్వాల్సిన అవసరం లేదు. ఎవరైనా ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించి దరఖాస్తులను విక్రయించినట్లుగా మా దృష్టికి వస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

అనుమానాలు వద్దు..



దరఖాస్తు చేసే వారంతా కొత్తగా పథకాల్లో లబ్ధి పొందే వారే ఉండాలి. ఇప్పటికే పింఛన్లు స్వీకరిస్తున్న వారంతా మరోసారి దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. ఎవ్వరూ గాబరా పడొద్దు. దరఖాస్తుదారుల డాటాను ఇప్పటికే మా వద్ద ఉన్న సమాచారంతో సరిచూడడం జరుగుతుంది. అభయహస్తం దరఖాస్తుతో ఆధార్ కార్డు, రేషన్ కార్డు నకలును జతచేయాల్సి ఉంటుంది. నిరక్షరాస్యులకు ఇబ్బంది లేకుండా కౌంటర్ల వద్ద అంగన్‌వాడీ, మహిళా సంఘాల ప్రతినిధులను సహాయకారిగా నియమించాం. ఇకపోతే ఎల్పీజీ ఏజెన్సీల వద్ద ప్రజలంతా భారీగా క్యూలైన్ కడుతున్నారు. ఈ–కేవైసీ కోసం బారులు తీరుతున్నారు. ఎవ్వరూ ఆందోళన చెందొద్దు. ప్రభుత్వమే అన్ని వివరాలను వెల్లడిస్తుంది. జిల్లాలో రోజుకు 70జీపీల్లో గ్రామసభలను నిర్వహిస్తున్నాం. ఇప్పటి వరకు 416 జీపీల్లో సభలు పూర్తయ్యాయి. మూడు మున్సిపాలిటీల్లోని 80 వార్డుల్లోనూ వేగంగా ప్రక్రియ జరుగుతున్నది. నిరంతరం సమీక్ష, పర్యవేక్షణ చేస్తుండడంతో స్వయంగా తనిఖీలు సైతం చేపడుతున్నాం.

వేగంగా డాటా ఎంట్రీ..

ప్రజాపాలన అభయహస్తం గ్యారెంటీ పథకాలకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ ప్రశాంతంగా జరుగుతున్నది. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ప్రజలకు అనువైన ప్రాంతాల్లో కౌంటర్లను ఏర్పాటు చేసి దానికి సంబంధించిన సమాచారాన్ని గ్రామాలు, మున్సిపాలిటీ ఏరియాల్లో వార్డుల్లోనూ ప్రచారం చేశాం. దరఖాస్తు ఫారాల కొరత మొదట్లో ఉన్నప్పటికీ ప్రస్తుతం అలాంటిదేమీ లేదు. ఇప్పటి వరకు స్వీకరించిన దరఖాస్తులను క్రమపద్ధతిలో ఆన్‌లైన్‌లో డాటాఎంట్రీ చేయబోతున్నాం. ఈ ప్రక్రియను శుక్రవారం నుంచే మొదలు పెడుతున్నాం. ఇందుకు సంబంధించిన శిక్షణ కోసం జిల్లా నుంచి సంబంధిత వ్యక్తులను హైదరాబాద్‌కు పంపించాం. నేటి నుంచి డాటా ఎంట్రీని నిర్వహిస్తాం. స్వీకరించిన దరఖాస్తుల వరుసను అనుసరించి వాటిని కంప్యూటర్‌లో భద్రపరుస్తాం. భవిష్యత్తులోనూ రిఫరెన్స్‌గా ఉపయోగపడేలా ఈ డాటాను నిక్షిప్తం చేయడం జరుగుతుంది. దరఖాస్తుదారులకు రశీదును అందిస్తున్నాం. ప్రజలంతా ఫారాలను పూర్తి సమాచారంతో నింపిన తర్వాత రశీదు విధిగా తీసుకోవాలి. అందులో పేర్కొన్న దరఖాస్తు నంబర్ ద్వారానే రాబోయే రోజుల్లో వివరాలను సరిచూడడం వంటివి జరుగుతుంది. డాటా ఎంట్రీని మండల కేంద్రాల్లోని తహసీల్, ఎంపీడీవో కార్యాలయాల్లో చేపట్టబోతున్నాం.

చివరి ఆయకట్టుకూ నీరందేలా చర్యలు తీసుకోవాలి

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్
- పోచారం ప్రాజెక్టు నుంచి నీటి విడుదల

ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్

ఎల్లారెడ్డి, జనవరి 4: పోచారం ప్రాజెక్టు చివరి ఆయకట్టు రైతులకు సాగు నీరు అందేలా నీటి పారుదల శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ అన్నారు. పోచారం ప్రాజెక్టు వద్ద యాసంగి పంటల కోసం గురువారం నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆలోచించి సాగు చేయాలని, వీలైతే ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించారు. నీటిని వృథా చేయకుండా వినియోగించుకుంటేనే ఆయకట్టు చివరి రైతులకు మేలు కలుగుతుందని తెలిపారు. పోచారం ప్రాజెక్టును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్, జడ్పీటీసీ మనోహర్ రెడ్డి, ఎంపీపీ రాజ్‌దాస్, సర్పంచ్ వాసు రెడ్డి, నీటి పారుదల శాఖ డీఈఈ వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

ఆర్మూర్ బల్దియాలో నెగ్గిన అవిశ్వాసం

- పదవి కోల్పోయిన చైర్‌పర్సన్ పండిత్ వినిత

అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా చేతులెత్తిన కౌన్సిలర్లు

ఆర్మూర్‌టౌన్, జనవరి 4 : ఆర్మూర్ బల్దియా చైర్‌పర్సన్ పండిత్ వినితకు షాక్ తగిలింది. అన్ని పార్టీల కౌన్సిలర్లు ఏకం కావడంతో పదవిని కోల్పోయారు. వినీతపై గత ఏడాది డిసెంబర్ నెలలో స్వపక్షంలోనే విపక్షం తయారైంది. కౌన్సిలర్లందరూ ఒక్కటై కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతుకు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని వినత పత్రం అందజేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అవిశ్వాస తీర్మాన సమావేశాన్ని కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో ఆర్మూర్ ఆర్డీవో వినోద్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్ గురువారం నిర్వహించారు. సమావేశానికి ఎక్స్ అఫిషియో మెంబర్‌గా ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి హాజరయ్యారు.

తీర్మానానికి 25 మంది మద్దతు..

బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లను మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి సోదరుడు ప్రైవేట్ బస్సులో మున్సిపల్ కార్యాలయానికి తీసుకొచ్చారు. ఇందులో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్నా, కౌన్సిలర్లు పుతిలి బేగం, ఖాందేశ్ సంగీత, ఎనుగంటి వర లక్ష్మి, బండారి ప్రసాద్, ఇట్టెడి నర్సారెడ్డి, మేడిదల సంగీత, కోనపత్రి కవిత, కోలు గంగామోహన్, సుంకరి ఈశ్వరి, అయేషా శిరీన్, వన్నెల్‌దేవి లావణ్య, అల్జాపూర్ రేవతి, నాజ్మిన్ సుల్తానా, బారడి రమేశ్, కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన మహ్మద్ ఇంతియాజ్ హుస్సేన్, ఎంఐఎం పార్టీకి చెందిన హర్షదీ బేగం, స్వతంత్రుడైన వనం శేఖర్ ఉన్నారు. వేరే కారులో వచ్చిన ఇతర పార్టీలో చేరిన గాండ్ల లక్ష్మి వెళ్లారు. అదే విధంగా బీజేపీకి చెందిన మున్సిపల్ కౌన్సిలర్లు పల్లెపు లత, ఆకుల సంగీత, జీవీ నరసింహా రెడ్డి కారులో వచ్చారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత, ఆమె మద్దతుదారులు సమావేశానికి హాజరు కాలేదు. బీఆర్ఎస్, కాంగ్రెస్, ఇద్దరు స్వతంత్ర కౌన్సిలర్లు, బీజేపీ కౌన్సిలర్లు మొత్తం 24 మంది.. ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డితో సహా మొత్తం 25 మంది సభ్యులు చేతులెత్తి అవిశ్వాస తీర్మానానికి మద్దతు పలికారు. దీంతో అవిశ్వాసం నెగ్గినట్లు ఆర్మూర్ ఆర్డీవో వినోద్ కుమార్, కమిషనర్ ప్రసాద్ చౌహాన్ ప్రకటించారు.

కలెక్టర్‌కు నివేదిక..

నాలుగు సంవత్సరాలుగా ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా కొనసాగిన పండిత్ వినిత.. అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో పదవిని కోల్పోయారు.

ఆర్డీవో వినోద్ కుమార్, కమిషనర్ ప్రసాద్ చౌహాన్ అవిశ్వాస తీర్మాన వివరాలను కలెక్టర్‌కు నివేదిస్తామని.. తదుపరి ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపల్ నూతన చైర్‌పర్సన్ ఎన్నికకు తేదీని ప్రకటిస్తామన్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఏసీపీ జగదీశ్ చందర్, ఎస్‌హెచ్‌వో సురేశ్ బాబు, ఎస్సైలు అశోక్, గంగాధర్, గోపి, యాదగిరి గౌడ్ బందోబస్తు నిర్వహించారు.

అవినీతి ఓడింది..

ఆర్మూర్‌టౌన్, జనవరి 4 : అవినీతిపైనే బీజేపీ పోరాటమని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. అవిశ్వాస తీర్మానం అనంతరం ఆయన మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. ఆర్మూర్ నియోజక వర్గంలో ఎక్కడా అవినీతి జరిగినా ఊరుకునే ప్రసక్తే లేదని అన్నారు. ప్రస్తుతం బల్దియాలో సైతం అవిశ్వాసం నెగ్గిందని.. అవినీతి ఓడిందన్నారు.

దరఖాస్తులు సరిగ్గా నింపాలి

కామారెడ్డి, జనవరి 4: ప్రజాపాల కార్యక్రమల్లో ప్రజలు అందిస్తున్న దరఖాస్తులను పరిశీలించి ఏ పథకం ద్వారా లబ్ధి కావాలో వాటి వివరాలను సరిగ్గా పూరించేలా చూడాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అధికారులకు సూచించారు. మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్‌లో కొనసాగుతున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్ప్‌డెస్క్‌లోని సిబ్బంది సహకారంతో దరఖాస్తులు నింపి రేషన్, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులను సమర్పించాలని ప్రజలకు సూచించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి తప్పులు లేకుండా రిజిస్టర్‌లో నమోదు చేయడంతోపాటు ఆన్‌లైన్‌లో డాటా ఎంట్రీ చేయాలని అధికారులను ఆదేశించారు.

రేపు మంత్రి జూపల్లి రాక

పిట్లం, జనవరి 4: పిట్లం మండలంలోని కుర్తి గ్రామానికి ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ నెల 6న వస్తున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జంబిగ హన్మాండ్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కుర్తిలో నిర్వహించే ప్రజాపాలన కార్యక్రమంలో మంత్రి జూపల్లి పాల్గొంటారని, ఆయన తోపాటు జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు హాజరవుతారని పేర్కొన్నారు.

జెండా ఊపి ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణ

సంకల్పయాత్రకు విశేష స్పందన

అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా

ఖిలీల్‌వాడి, జనవరి 4 : ప్రధాని మోదీ ఆధ్వర్యంలో 2047 నాటికి దేశాన్ని వికసిత్ భారత్‌గా అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా పని చేద్దామని, అర్హులందరికీ కేంద్ర ప్రభుత్వ పథకాలు అందాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా సూచించారు. నగరంలోని వర్ని చౌరస్తా వద్ద వికసిత్ భారత్ సంకల్ప యాత్రను ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న వివిధ సంక్షేమ పథకాలపై ఆయా శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను ఎమ్మెల్యే సందర్శించి మాట్లాడారు. 2047 వరకు దేశం వికసితం కావాలంటే మనమందరం భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఈ కార్యక్రమానికి సంబంధించి ప్రచార వ్యాన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో సెంట్రల్ బ్యూరో కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ బి.ధర్మానాయక్, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ యు.నాగశ్రీనివాస్‌రావు, ఎన్‌వైకే జిల్లా కోఆర్డినేటర్ శైలి బెల్లాల్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ వెంకటభార్గవ నాయుడు, కార్పొరేటర్ వెల్డింగ్ నారాయణ, సెంట్రల్ బ్యూరో కమ్యూనికేషన్ ఎఫ్‌పీఏ రషీద్, ఎంటీఎస్ పోచయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జీ సభ్యులకు డ్రోన్ శిక్షణ

ఇందల్వాయి, జనవరి 4 : జిల్లాలో ఎస్‌హెచ్‌జీ (సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్) సభ్యుల కోసం చెన్నై/బెంగళూర్‌లో ఈ నెల మూడోవారంలో డ్రోన్ ఫ్లయింగ్ పైలట్ శిక్షణ ఇవ్వనున్నారని డీఆర్డీవో చందర్‌నాయక్ తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పదోతరగతి పాసై, 18 నుంచి 35 ఏండ్లలోపు వారు శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్ అందజేస్తారని తెలిపారు. శిక్షణ కోసం వెళ్లే సభ్యుల వివరాలను జిల్లా కేంద్రంలోని డీఎంఎంయూ కార్యాలయంలో ఈ నెల8 లోగా అందజేయాలని సూచించారు.